కథ

**ఆరోజు రాత్రి డిన్నరు చేస్తున్నప్పుడు డైనింగ్ టేబుల్ వద్ద ఆటంబాంబు లాంటి న్యూస్ పేల్చింది రమ్య.**

**ఈమధ్య రమ్య పరధ్యానంగా ఉండటం, గంటలు గంటలు లోగొంతుకతో ఫోన్లో మాట్లాడటం అప్పుడప్పుడు కళ్ళు కలలు కంటున్నట్లు తేలిపోవడం ఇవన్నీ గమనిస్తూనే ఉంది వాసంతి.**

# దెబ్బకు వదిలిన దెయ్యం

వాసంతికి ఇద్దరు కూతుళ్ళు- సౌమ్య, రమ్య.

పెద్దకూతురు సౌమ్య పేరుకు తగ్గట్లుగా సౌమ్యమైన ప్రవర్తనతో అందరినీ ఆకట్టుకుంటుంది. ఆమె బి.టెక్ పూర్తిచేసి తన క్లాస్‌మేట్ అయిన అవినాశ్‌ని ప్రేమించి పెద్దల అనుమతితో అతన్ని వివాహం చేసుకొని హెచ్.వన్ వీసాతో ఇద్దరూ అమెరికా వెళ్ళి చక్కగా సెటిలయ్యారు.

ఇక మిగిలింది రమ్య. సౌమ్య తరువాత ఆరేళ్ళకి రమ్య పుట్టింది. రెండో ప్రసవానికి తన పుట్టింటికి వెళ్ళినప్పుడు వాసంతి భర్త ఐపిఎస్ అధికారి పవన్ కుమార్‌ని నక్సలైట్లు కాల్చి చంపారు. ఆకస్మికంగా జరిగిన ఈ విషాద సంఘటన కారణంగా వాసంతి ఏడాదిపాటు డీప్ షాక్‌లో ఉండిపోయింది. ఆమె తల్లీ, అన్నగారూ పిల్లల సంరక్షణ బాధ్యతలు చేపట్టి ఆమెని మామూలు మనిషిని చేశారు.

ఆ తర్వాత వాసంతికి హైదరాబాదులో పోస్టింగ్ వచ్చింది. ఉద్యోగ బాధ్యతలతోపాటుగా ఇద్దరు పిల్లల సంరక్షణ తనకు భారమవుతుందని రమ్యను తనవద్దే ఉంచుకొని పెంచింది, వాసంతి తల్లి రమణమ్మగారు. సౌమ్య కాస్త పెద్దదయి ఫిఫ్త్ క్లాసులోకి వచ్చింది. తన పనులన్నీ తనే చేసుకుంటూ చక్కగా చదువుకోసాగింది. వాసంతి దగ్గర రంగమ్మ అనే మంచి బాధ్యతగల పనిమనిషి కూడా కుదరటంతో రమ్య నాలుగేళ్ళున్నప్పుడు ఇక్కడికే తీసుకొని వచ్చి స్కూల్లో చేర్పించింది.

పన్నెండేళ్ళు గడిచిపోయాయి. వాసంతి ఉద్యోగం స్థాయి పెరిగింది. హైదరాబాద్‌లోనే ప్రశాంత్‌నగర్ ఐఎఎస్, ఐపీయస్ కాలనీలో ఇల్లు కట్టుకొని సెటిలైపోయింది. సౌమ్య ఒకరోజు అవినాశ్‌ని తీసుకొని వచ్చి తన క్లాస్‌మేట్‌గా వాసంతికి పరిచయం చేసింది. ఓ అరగంట అతనితో మాట్లాడిన తనకు ఆ అబ్బాయి పట్ల సదభిప్రాయం ఏర్పడింది. అవినాశ్ వెళ్ళాక సౌమ్య వాసంతితో-

''మమ్మీ! అవినాశ్ నన్ను పెళ్ళి కోసం ప్రపోజ్ చేశాడు. నాక్కూడా అతడు నచ్చాడు. నీకూ ఇష్టమైతే మాకు ఉద్యోగాలు వచ్చింతర్వాత వివాహం చేసుకోవాలనీ...'' తన వైపు చూస్తూ ఆగింది.

వాసంతికి అభ్యంతర పెట్టడానికి కారణమేమీ దొరకలేదు. ఆమెకు సౌమ్య వ్యక్తిత్వం మీద ఉన్న నమ్మకం కూడా ఆమె త్వరగా అంగీకరించడానికి తోడ్పడిందేమో. ఆ తర్వాత త్వరలోనే వాళ్ళ వివాహం వైభవంగా జరిపించింది.

ఇక మిగిలింది రమ్య. చిన్ననాడు నాలుగేళ్ళు అమ్మమ్మ వద్ద అతిగారాబంగా పెరగడంతో పెంకిగా తయారయ్యింది. దానికి చదువుమీద అసలే శ్రద్ధ లేదు.

ఎప్పటికీ స్నేహితులతో కబుర్లు, సినిమాలు, షికార్లతోనే సరిపోతుంది. తననుకున్నదేమన్నా కాదంటే ఏడుస్తూ డాడీ ఉంటే అన్నింటికీ ఒప్పుకునేవారు అంటూ అలిగి సాధిస్తుంది. ప్రతీ క్లాసులో అత్తెసరు మార్కులతో పాసవుతూ ఈ ఏడాది బి.కాంలో చేరింది. అందరికీ చదువుపట్ల ఒక్కలాంటి ఆసక్తి ఉండదు. పోనీ కనీసం ఆ డిగ్రీ పూర్తిచేస్తే చాలు ఆ తర్వాత శ్రద్ధ కలిగితే ఎంబీఏ చదివించి చిన్న యూనిట్ ఏదైనా పెట్టించవచ్చు. ఈ కాలంలో ఆడపిల్లయినా తమ కాళ్ళమీద తాము నిలబడగలగడం తప్పనిసరి అనుకుంటున్న తరుణంలో వాసంతి దూరపు బంధువులలో ఒకరు వాళ్ళ అబ్బాయికి రమ్యని చేసుకుంటామని అడిగారు.

రమ్య చాలా అందంగా ఉంటుంది. ఏదో పార్టీలో వాళ్ళు రమ్యని చూశారట. వాళ్ళ అబ్బాయి డాక్టరు. ఒక్కడే కుమారుడు. బోలెడు ఆస్తి. అబ్బాయికి నర్సింగ్‌హోమ్ కట్టించి, సాంప్రదాయమైన కుటుంబంలోని అందమైన అమ్మాయినిచ్చి వివాహం చేసి కళ్ళముందు కొడుకూ కోడలూ చిలకా గోరింకల్లా తిరుగుతుంటే చూసుకోవాలన్న కోరిక ఉన్న వాళ్ళు, అమ్మాయి ఎక్కువగా చదువుకోకపోయినా ఫరవాలేదని కూడా అన్నారు.

వాసంతికి, చిన్న వయసులో చదువు పూర్తికాకుండా తన కూతురికి వివాహం తలపెట్టాలని ముందుగా అనుకోలేదు. ఆమె అందుకు వ్యతిరేకి కూడా. కానీ ఈమధ్య రమ్య ప్రవర్తన ఆమెలో కొన్ని అనుమానాలు రేకెత్తించింది. రమ్య అమాయకురాలు, పైగా అందంగా ఉంటుంది. లోకంలో ఎన్నోరకాల మనస్తత్వాలు గలవాళ్ళు, ఎన్నోరకాల ఆకర్షణలూ ప్రలోభాలూ ఉంటాయి. వాటినన్నిటినీ దాటుకొని అందులోనుండి సరి అయిన వ్యక్తిత్వం గల మనిషిని ఎన్నుకునే నేర్పు రమ్యకి లేదు.

మంచి సంబంధం వచ్చినప్పుడు తను పెళ్ళి చేసేయటమే మేలేమో!

వివాహం ద్వారా రక్షణ కల్పిస్తే, ఆ తర్వాత కూడా మెల్లిగా వీలునుబట్టి చదువు పూర్తిచేయవచ్చు అన్న ఆలోచనతో తను వీలుచూసుకుని కబురంపుతానని వాళ్ళకి చెప్పింది.

ఈరోజు డిన్నర్ చేస్తున్నప్పుడు ఆ విషయాన్ని రమ్యతో చెప్పింది. ''అబ్బాయి బావుంటాడు. మంచి సంబంధం. నువ్వు సరేనంటే పెళ్ళి చూపు లేర్పాటు చేస్తాను''

ఆ మాటలు వినగానే రమ్య ముఖంలో గబగబా రంగులు మారాయి. ఫోర్క్‌తో స్పెగటీ నోట్లో పెట్టుకోబోతున్నదల్లా ఆ ఫోర్క్ అలాగే ప్లేట్‌లోకి జారవేసి-

''మమ్మీ! సంబంధాలు చూడాల్సిన అవసరం లేదు. అక్కలాగే నేను కూడా ఒకతన్ని ప్రేమించాను. త్వరలో పెళ్ళి కూడా చేసుకోవాలని నిర్ణయించుకున్నాను'' అన్నది.

ఇంకేం ఆటంబాంబు పేలనే పేలింది. వాసంతి ముందే కాస్త ఊహించి ఉండడం వల్ల మరీ ఎక్కువ షాక్‌కి గురికాలేదు. రమ్య చదివేది విల్లామేరీ వుమెన్స్ కాలేజీలో. వాసంతి రమ్యను సూటిగానే అడిగింది, అతనెక్కడ ఎలా పరిచయమయ్యాడో అనుకుంటూ-

''ఎవరతను?''

''అంజి'' అన్నది రమ్య.

ఆ పేరు వినగానే ఉలిక్కిపడ్డది ''అంజి. అదేం పేరు..''

''అబ్బా...మమ్మీ అతని పూర్తిపేరు అంజన్‌కుమార్ యాదవ్. ఫ్రెండ్సందరూ అతన్ని అంజి

అని పిలుస్తారు. ఈరోజుల్లో అలా బ్రేక్ చేసిన పేర్లే ఫ్యాషన్ తెల్సా. అంజీ. వెంకీ, సాంబా, ఈ కాలంలో హీరోలకన్నీ అలాంటి పేర్లే పెడుతున్నారు మమ్మీ. అవి లక్కీనేమ్స్ అట. తెల్సా'' అన్నది కళ్ళు చక్రాల్లా తిప్పుతూ.


''పేరు సరే అతడుండేదెక్కడ?''


''బోరబండ''

ఈసారి మాత్రం నెత్తిన పిడుగు పడ్డట్టయ్యింది వాసంతికి. పేరుతోనే, అతని నివాస స్థలంతోనే ఆమె అతని స్థితిగతులు ఊహించగల్గింది. బోరబండ స్లమ్ ఏరియా.

''అతని తండ్రేం చేస్తుంటాడు?''

''హోల్‌సేల్‌గా మిల్క్ అండ్ మిల్క్ ప్రొడక్ట్స్ సప్లయ్ చేస్తుంటాడు''





'ఓ... పాల వ్యాపారానికి వీళ్ళు మెరుగులు దిద్ది చెప్పిన పదమన్నమాట'

''మరి ఈ అబ్బాయి నీకెలా పరిచయమయ్యాడు''

''కాఫీ డేలో మమ్మీ! అంజి తన పాకెట్ మనీ కోసం కాఫీ డేలో పార్ట్‌టైం జాబ్ చేస్తూ నైట్ కాలేజీలో బి.ఏ. చదువుతున్నాడు'' గొప్పగా చెప్పింది.

''మరి నువ్వు ఎప్పుడన్నా అతనింటికి వెళ్ళావా?'' అన్నది.

''వెళ్ళాను మమ్మీ అదేదో సినిమాలో చూపించినట్లుగా ఇంటి ముందు బోలెడు పశువులు కట్టేసి వున్నాయి. నాకా వాసనకు లోపలికి వెళ్ళాలనిపించలేదు. వచ్చేశాను. అప్పుడు అంజి అన్నాడు. సర్లే నీ కిష్టం కానట్లయితే మన పెళ్ళి తర్వాత ఇక్కడుండాల్సిన అవసరం లేదు. నేనే నీతో వచ్చి మీ ఇంట్లో వుంటాను. మీ అక్క కూడా అమెరికాలో ఉంటుంది కదా! మీ మమ్మీకి మాత్రం ఎవరున్నారు? మనం తోడుగా ఉంటే ఆవిడక్కూడా బాగుంటుంది అన్నాడు. మమ్మీ నిజంగా అంజి ఎంత మంచివాడు కదూ'' అన్నది.

ఆ మాటలతో అంజి అన్న శాస్త్రీ మనోగతం

ప్రవీణ

''హతోస్మి'' అనుకుంది.

వాసంతికి కులాల పట్టింపు పెద్దగా లేదు. పాల వ్యాపారస్థుల మీదగానీ పేదరికం మీదగానీ ఆమెకెలాంటి చులకనభావం లేదు. కానీ ఒక వివాహ బంధంలో ఇమడాలంటే ఆ ఇద్దరిమధ్యా సరి అయిన వేవ్ లెంగ్త్ ఉండాలి. లేకపోతే ఆ పెళ్ళి మూణ్ణాళ్ళలో పెటాకులవుతుంది. వాసంతి ఇంకాస్త టాపిక్ పెంచింది.

వాసంతికి పూర్తిగా అర్థమయ్యింది. కానీ అటువంటి మనిషిలో ఏం చూసి తన కూతురు అతని పట్ల ఇంత బలంగా ఆకర్షింపబడి ఉంటుంది, అదే అడిగింది.

''నీకతను ఎందుకు నచ్చాడు?'' అని.

''నేనూ నా ఫ్రెండ్సూ ఒకసారి మాట్నీషోకి వెళ్ళాం మమ్మీ. టిక్కెట్లు దొరకలేదు. ఏం చెయ్యాలో తెలియక దిగాలు పడుతూ కాఫీ డేకి వెళ్ళి అక్కడ కోల్డ్ కాఫీ తాగుతూ మాట్లాడుకుంటున్నాం.

కథా నిలయం

''అయ్యో నా ఫేవరేట్ హీరో సినిమా రిలీజైన ఫస్ట్‌డే చూడలేకపోతున్నందుకు ఎంతో బాధగా ఉందే'' అని నా ఫ్రెండ్స్‌తో చెబుతుంటే అక్కడే ఉన్న అంజి ఆ విషయం విని ''బాధపడకండి మేడమ్ ఆ థియేటర్లో నా ఇన్‌ఫ్లుయెన్సు బాగా నడుస్తుంది. బాక్స్ టికెట్లు విఐపీల కొరకు తీసి ఉంచుతారు. తెప్పిస్తానుండండి'' అని ఇలా వెళ్ళి అలా నాలుగు టికెట్లు తెచ్చాడు. అతనివల్లే నేనా రోజు ఆ సినిమా చూడగలిగాను'' అంటూన్న కూతురి వంక నోరు తెరిచి చూస్తూండిపోయింది.

ఏం మాట్లాడకుండా కూర్చుండిపోయిన తల్లి వంక చూస్తూ ''మమ్మీ నీకిష్టం ఉన్నా లేకున్నా ఈ వివాహం జరిగి తీరుతుంది. నువ్వెందుకు ఇంతలా ఆలోచిస్తున్నావో నాకర్థం కావడం లేదు. ప్రేమంటే ఇలాగే ఉంటుంది మమ్మీ..అసలు మీ జనరేషన్ వాళ్ళకు ఏదీ తెలియదు. అదే అక్క అడిగితే తేలికగా ఒప్పేసుకున్నావు. ఎంతయినా నీకదంటేనే ఇష్టం'' అంటూ ఇక ఏడుపు మొదలుపెట్టి వెక్కిళ్ళ మధ్య ''నువ్వు కాదన్నా నేను ఇంట్లో నుండి వెళ్ళిపోయి అంజిని పెళ్ళి చేసుకుంటాను'' అన్నది బెదిరిస్తున్నట్లుగా.

ఇక లాభం లేదు. దీనికి పైత్యం బాగా ముదిరింది అనుకుంటూ ముఖం ప్రసన్నంగా మార్చుకొని ''చూడు రమ్యా నేనీ పెళ్ళికి ఒప్పుకుంటున్నాను.

అయితే ఒక్క షరతు. సౌమ్య, అవినాశ్‌లు వెకేషన్‌కి డిసెంబరులో ఇండియాకి వస్తున్నారు. ఉన్న ఒక్క అక్కా లేకుండా నీ వివాహం జరిగితే నీకేమన్నా సరదాగా ఉంటుందా? నేను డిసెంబరు నెలలో ముహూర్తాలు పెట్టిస్తాను. అప్పటివరకూ ఏ విషయంలోనూ తొందరపడనని నాకు మాటివ్వు'' అన్నది చెయ్యి చాస్తూ.

వాసంతి ఆ మాటలనడంతోనే వికసించిన ముఖంతో ''థాంక్యూ మమ్మీ'' అంటూ సిన్సియర్‌గానే వాసంతి చేతిలో చెయ్యి వేసింది రమ్య.

★ ★ ★

ఆ రాత్రి ఎంతకీ నిద్రపట్టలేదు వాసంతికి. ఆమెకి సమస్యనెలా ఎదుర్కోవాలో తెలియలేదు. నేటి యువతరంలో సౌమ్య లాంటివాళ్ళున్నట్లే, రమ్య లాంటివాళ్ళూ ఉంటారు. సినిమాల్లో తేనె పట్టుల్లోంచి తేనె తీసి అమ్మే యువకుడినీ, పొగరుమోతు ఆటోడ్రైవర్నీ డబ్బున్న అమ్మాయిలు ప్రేమించడం క్యాచ్ చేసే వీళ్ళు ఆ హీరోల వెనక అంతర్లీనంగా దాగి ఉన్న ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని గ్రహించలేకపోతున్నారు. ఆ వయసులో తొందరపాటెక్కువ. వాళ్ళ బుర్రల్లో మంచిని గ్రహించే ఆలోచనాపటిమ తక్కువే. నాలుగు సినిమా టికెట్లు సాధించి తేవడమే హీరోయిజంగా భావించి అటువంటి వ్యక్తికి జీవితాన్నే అర్పిస్తామనుకునే అమాయకమైన రమ్య లాంటివాళ్ళని ఈకాలం తల్లిదండ్రులు కాపాడుకోగల్గటం ప్రయాసతో కూడుకున్న పని.

ఆమె మంచం పక్కన సైడ్ టేబుల్‌పై ఉన్న భర్త ఫోటో చేతుల్లోకి తీసుకుంది. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. 'పవన్, రమ్యకి పట్టిన దెయ్యాన్ని ఎలా వదిలించాలి? నాకేం ఉపాయం తోచడం లేదు' మనసులోనే అనుకుంది. ఆమెకు తన అన్నయ్య గుర్తుకువచ్చాడు. ఫోన్ కలుపుదామని రిసీవర్ లేపింది. అందులోంచి ఏవో మాటలు వినిపించాయి. రమ్య తన గదిలోనున్న ఎక్స్‌టెన్షన్ ద్వారా ఎవరికో ఫోన్ కలిపినట్లుంది అనుకుంటూ రిసీవర్ క్రెడిల్‌పై పెట్టేయబోయిన ఆమెకు మగగొంతు వినిపించడం, అందులోనూ ఇంత రాత్రివేళ రమ్య ఎవరితో మాట్లాడుతూందో అనుకుంటూ ఆ మాటలు వినసాగింది.

రమ్య అంటూంది. ''మా మమ్మీ పెళ్ళికి ఒప్పుకుంది అంజీ''

''ఓ, ఇంత త్వరగా ఒప్పేసుకుందా! తను కాదంటే నిన్ను తీసుకుని ఏ అడవిలోకో పారిపోవాలనుకున్నాను. అక్కడ ఇద్దరమే హాయిగా ఏ చెట్టుకిందో బాన్‌ఫైర్ వేసుకొని ఒకరి ఒళ్ళో ఒకరం ఉండేవాళ్ళం. అయ్యో ఎంత థ్రిల్ మిస్సయ్యాం'' అంటున్నాడు.

''అవును అంజీ. ఇదేదో సినిమాలో సీన్‌లాగా ఎంత బాగుండేదో. సరే ఏం చేస్తాం. ఇప్పటికి దీంతో తృప్తి చెందాలి'' అంటూంది.

''ఇక ఆ విషయం వదిలెయ్యి, రేపేం ప్రోగ్రాం'' అడిగాడు.

''నేను కాలేజీ ఎగ్గొట్టి వస్తాను. రేపు మార్నింగ్ షో సినిమాకి వెళ్ళి మెల్టింగ్ మూమెంట్స్‌లో ఐస్‌క్రీం తిందాం'' అన్నది.

''రమ్యా వెరైటీగా రేపు సాయంకాలం పబ్‌కి వెళ్దాం'' అన్నాడు అంజి.

''సాయంత్రాలు మమ్మీ కారణం లేకుండా బయటికి వెళ్ళనివ్వదు. పబ్‌కి వెళ్తే చాలా రాత్రవుతుంది. అయినా నీకోసం రావడానికి ప్రయత్నిస్తాను'' అన్నది.

''వచ్చేటప్పుడు చాలా డబ్బు తీసుకురా. నాకింకా మా బాస్ శాలరీ ఇవ్వలేదు'' అంటున్నాడతడు.

ఇక వినలేనట్లుగా వాసంతి ఫోన్ పెట్టేసి లేచి తన సెల్ తెచ్చుకుని తన అన్నయ్య రాఘవకి ఫోన్ కలిపింది.

''ఏం జరిగింది వాసంతీ, ఇంత రాత్రి వేళ ఫోన్ చేశావ్''

ఆమె జరిగిందంతా చెప్పింది.

''నువ్వేం కంగారు పడకు. ఏం చెయ్యాలో ఆలోచించి రేపుదయాన్నే ఫోన్ చేస్తాను, సరేనా. నువ్వు హాయిగా నిద్రపో'' అన్నాడు.

★ ★ ★

ఆ రోజు ఆదివారం ఇంట్లో అదే పనిగా ఫోన్ మోగసాగింది. అన్ని కాల్స్‌నూ ఓపిగ్గా లిఫ్ట్ చేసి సమాధానాలిస్తూంది వాసంతి. ఆమె ఇచ్చే సమాధానాలను బట్టి తమ ఇల్లు ఐదువందల చదరపు గజాల స్థలంలో మూడువేల స్క్వేర్ ఫీట్ల కన్‌స్ట్రక్షన్ ఏరియా కలిగి ఉందనీ, అరవై లక్షలు రేట్ కోట్ చేస్తున్నట్లుగా అర్థమయ్యింది రమ్యకి.

''మమ్మీ ఇల్లమ్మడం ఎందుకూ?'' అడిగింది.

''ఈ ఇంటిని మూడు భాగాలుగా విడగొట్టడం సాధ్యం కాదుగా రమ్యా. నేనిన్నాళ్ళూ నా సర్వీసులో కష్టపడి మిగిల్చిన ఆస్తి ఇదే. సౌమ్య పెళ్ళి జరిపినట్లే నీ పెళ్ళి ఖర్చులకీ డబ్బు దాచి ఉంచాను. ఆ డబ్బుతో నీ వివాహం చేసి ఈ ఇల్లు అమ్మగా వచ్చిన డబ్బుని మూడు భాగాలు చేస్తాను. ఒక భాగం డబ్బు సౌమ్యది. ఒక భాగం నీది. మిగిలిన భాగం నేను తీసుకుంటాను. మీ పెళ్ళిళ్ళ తరువాత నేనిక ఉద్యోగం చేయలేను. నాకూ విశ్రాంతి కావాలి. అందుకే వాలెంటరీ రిటైర్మెంటు తీసుకుంటాను. అలాగని నా భారం కూతుళ్ళపై మోపలేను. నా భాగం డబ్బు తీసుకొని నేను మా అమ్మ దగ్గరకు వెళ్తాను రమ్యా. ఒకరికొకరం తోడుగా ఉంటూ అక్కడే ఊళ్ళో ఒక వృద్ధాశ్రమం తెరిచి వృద్ధులకు సేవ చేయాలనే నా చిరకాల వాంఛ తీర్చుకుంటాను'' అన్నది. ఆమె మాటల్లో కూతుళ్ళ ఇష్టానికి వివాహాలు చేసి తన శేష జీవితాన్ని తనకిష్టమైన విధంగా గడపాలని దృఢచిత్తం గోచరిస్తుంది.

''ఈ ఇల్లమ్మితే ఎంత వస్తుంది మమ్మీ?'' అడిగింది.

## అమూల్యం

**సృష్టిలో కొన్ని అమూల్యమైనవి. అలాంటి వాటిలో ప్రేమ ఒకటి. 'చాలామంది ప్రేమ గురించి చాలా తక్కువగా మాట్లాడతారు. నిజమైన ప్రేమ ఎక్కడా లభించదు. తల్లి ఇచ్చే ప్రేమలాంటిది. ప్రేమను తక్కువ చేసి మాట్లాడేవారంటే నాకెంతో అసహ్యం. ప్రేమ అమూల్యమైనది. ఎక్కడో కొనుక్కుందామంటే లభించేది కాదు. ఇది సృష్టిలో తీయనిది. ప్రేమ అనుభవించాలంటే మంచి మనసుండాలి' అని తెగ చెప్పుకుపోతోంది సొట్టబుగ్గల సుందరి ప్రీతీ జింతా. అసలీమెకు ఏమైంది? అంటున్నారంతా.**



''సుమారు నలభై అయిదు లక్షల వరకూ రావచ్చు. అందులో టాక్సులూ, కొంత హౌసింగు లోనూ పోగా ముప్పై ఆరు లక్షలు మిగులుతుంది. తలా పన్నెండు లక్షలు వస్తాయి. మీ వంతుకు వచ్చే డబ్బుతో నీకోసం ఈ సిటీ చివర ఏదైనా అపార్ట్ మెంట్ దొరుకుతుందేమో చూస్తాను. మిగతా పాట్లేవో మీరు పడాలి'' అంది కేజువల్గా.

''అపార్ట్మెంటా?''

''అవును. ఏం?'' ''ఏ...ఏం లేదు''

రమ్య ఏదో ఆలోచిస్తున్నట్లుగా మౌనంగా తన గదిలోకి వెళ్ళిపోయింది.

★ ★ ★

సోమవారం ఉదయం లేచి రెడీ అయ్యి కాలేజీకి బయల్దేరింది రమ్య. ఇంకా నైటీలోనే ఉన్న వాసంతిని చూస్తూ ''ఆఫీసుకి వెళ్ళవా మమ్మీ'' అడిగింది.

''ఈవారం లీవు పెట్టాను. ఇల్లమ్మే పనులు చూసుకోవాలి. కొనే పార్టీలు వస్తే ఇల్లు చూపించి అన్ని వివరాలూ మాట్లాడాలి కదా'' అన్నది.

రమ్య కాలేజీకి వెళ్ళబోతుంటే ''రమ్యా నేను లీవులో ఉన్నాను కదా, ఆఫీసు కారు, డ్రైవరు రాడు. ఇదిగో ఈ ఏభైరూపాయలూ తీసుకుని ఆటోలో వెళ్ళిరా'' అన్నది.

''మమ్మీ నాకింకా డబ్బు కావాలి'' అన్నది. ఆమె మరో వంద ఇచ్చింది. ''సరిపోదు మమ్మీ'' కాస్త హఠం చేస్తూ అడిగింది. ''రమ్యా నా దగ్గర ప్రస్తుతానికి డబ్బెక్కువ లేదు. లీవులో ఉన్నాను. ఈ నెల ఇంకా శాలరీ కూడా రాలేదు'' అన్నది.

''షిట్'' కోపంగా వెళ్ళింది. ఎంతోదూరం నడిస్తేగానీ ఆటో దొరకలేదు. రోజూ మమ్మీ ఆఫీసుకి వెళ్తూ తనని కాలేజీ వద్ద డ్రాప్ చేసేది. తను కాలేజీ మధ్యలో ఎటెళ్ళినా కాలేజీ వదిలే సమయానికి కాలేజీ వద్దకు వచ్చి అక్కడ సిద్ధంగా ఉన్న కార్లో ఇంటికి తిరిగి వెళ్ళేది.

రమ్య కాలేజీలో కాసేపు ఉండి అక్కడినుంచి అంజి దగ్గరకు వెళ్ళింది. ఇద్దరూ సినిమాకు వెళ్ళారు. తల్లి ఇచ్చిన వందా అయిపోయింది. సినిమా చూసి బయటికి వచ్చారు. బైక్ పైన వెళ్తూండగా ''అంజీ ఆకలిగా ఉంది. ఐస్క్రీమ్ తిందామా?'' అడిగింది రమ్య.

''డబ్బులున్నాయా?'' అన్నాడు.

''నీ దగ్గర లేవా?'' విసుగ్గా అన్నది రమ్య.

''లేవు. నాకింకా శాలరీ రాలేదు'' అన్నాడు.

'నీకెప్పుడు శాలరీ వచ్చిచచ్చిందని' కసిగా అనుకుంటూ ''ఆటో స్టాండు వద్ద దింపు'' అన్నది.

అలా వారం గడిచింది. ఈ వారం రోజులూ రమ్య నానా ఇబ్బందులూ పడ్డది. ఇంట్లో డబ్బులేదని వాసంతి రోజూ రమ్యకి బొటాబొటీగా లెక్క చూసి డబ్బులిచ్చింది. ఎప్పటిలాగే హఠం చేస్తే పర్సు తెచ్చి ముందుంచింది. అందులో కొన్ని నోట్లే ఉన్నాయి. తను ఆఫీసుకి వెళ్తేనే పే చెక్కు వస్తుందనీ కొద్దిరోజులు ఓపిక పట్టమనీ అన్నది.

ఈ వారం రోజుల అనుభవంతో రమ్యకి తన తల్లిని వదిలిన మరుక్షణం తన పరిస్థితేమవుతుందో అర్థమైంది. ఎక్కడో మారుమూల చిన్న అపార్ట్మెంట్లో అంజి డొక్కు బైక్మీద తిరుగుతూ తిండి కూడా సరిగ్గా లేక కడుపు మాడ్చుకుంటూ బతకాల్సి వస్తుందని బాగా తెలిసి వచ్చింది.

ఆరోజు కాలేజీకి రెడీ అయ్యి బయటికి వచ్చేసరికి వాసంతి కూడా ఆఫీసుకి వెళ్ళేందుకు సిద్ధమయ్యింది. రమ్యను కాలేజీలో దింపి తను ఆఫీసుకు వెళ్ళింది. కారు దిగేటప్పుడు రమ్యకి మూడు వందలిచ్చింది వాసంతి.

ఈ వారం రోజులూ డబ్బు ఇబ్బందితో కటకటలాడిన రమ్యకి చేతికి వచ్చిన ఆ డబ్బు ఖర్చు చేయాలనిపించలేదు. ఆ రోజామె అంజి దగ్గరకు వెళ్ళలేదు.

సాయంత్రం కాలేజీ బయటికి రాగానే రెడీగా ఉన్న కారు డోరు తెరిచి పట్టుకున్న డ్రైవర్ని చూడగానే ప్రాణం లేచి వచ్చింది. ఆరోజు ఇంటికి వెళ్ళిన రమ్యకి ఎక్కడో తప్పిపోయి తిరిగి తిరిగి ఆఖరికి తల్లి వడిలోకి చేరి సేదతీరుతున్నట్లుగా అన్పించింది. పనిమనిషి రంగమ్మ చేసిపెట్టిన వేడి వేడి దోశలు తిని జ్యూస్ తాగేలోపు వాసంతి వచ్చింది.

రంగమ్మ వాసంతికి కాఫీ కలిపి ఇచ్చింది. కాఫీ తాగుతూ ''రమ్యా! రేపు వైజాగ్ నుండి మామయ్యను ఫోన్ చేసి రమ్మంటాను. నీకు, అంజీకీ పెళ్ళి ముహూర్తం పెట్టించాలి కదా.

అలాగే అంజి తరఫు పెద్దవాళ్ళను కూడా పిలవాలి'' అన్నది.

''వద్దు మమ్మీ నాకిప్పుడే పెళ్ళి వద్దు. నాకు చదువుకోవాలని వుంది'' అంటూన్న రమ్యవైపు నమ్మలేనట్లుగా చూసింది వాసంతి.

''అవును మమ్మీ నేను అంజిని పెళ్ళి చేసుకోను. నాకిష్టం లేదు'' ఏడుస్తూ అనేసింది రమ్య. వాసంతి లేచి రమ్య దగ్గరకు వెళ్ళి ఆమె మానసిక స్థితిని అర్థం చేసుకున్నట్లుగా ఆమె తలను దగ్గరగా తీసుకుంటూ ''నీకిష్టం లేకుంటే వద్దు రమ్యా ఊరుకో'' అన్నది.

ఆమె మనసులో మాత్రం, హమ్మయ్య 'దెబ్బకు దెయ్యం వదిలింది' అనుకుంది, అన్నయ్య చెప్పిన పాచిక పారినందుకు సంతోషిస్తూ.

❀

## ప్రోత్సాహం

సినిమాల్లో నటించి మంచి పేరు తెచ్చుకుంటే అంతర్జాతీయంగా మంచి పేరు ప్రఖ్యాతులు లభిస్తాయి. ఐశ్వర్యా రాయ్ ఇప్పుడు సినిమాలకంటే కంపెనీ యాడ్స్లో నటించడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది. లా ఓరియల్ కంపెనీ అడ్వర్టైజ్మెంట్స్ కోసం ఆమె తెగ కష్టపడుతోంది. ఇదిలా ఉంటే మన మీడియా కంటే అంతర్జాతీయ మీడియా తనకెంతో ప్రోత్సాహాన్ని ఇస్తోందని ఐస్ తెగ సంబరపడిపోతూ చెబుతోంది.

